RNI NO:APTEL/2018/76747

# నవతరం

తెలుగు దినపత్రిక

NAVATARAM TELUGU DAILY ఎడిటర్: శిరిగిరి వరదరాజు

పబ్లిష్: రాజమహేంద్రవరం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, వెస్ట్ గోదావరి సంపుటి:11 సంచిక: 42 గురువారం, 26-02-2026 పేజీలు:4 వెల:1.00

## రాముడు కాదు కృష్ణుడా.......!

### తన రాజకీయ లీలలు అమోఘం.....!

**నవతరం, విజయవాడ**

ఆనాటి పార్టీకి పదవి తీసుకుని భ్రష్టు పట్టించిన చరిత్ర..! ఒక పోలీసు ఉన్నతాధికారికేఅన్ని ఇబ్బందులను పెట్టిన నేటి ఉపసభాపతి....! అటువంటి పదవికి కళంకం అంటున్న రాజకీయ పండితులు...! రఘు రామకృష్ణరాజు కస్టోడియల్టార్చర్ భరించరానిది అంటున్న ఐపీఎస్ సునీల్..! తన పార్టీ కీలక నేతలకే చుక్కలుచూపిస్తూన్న ప్రముఖుడు..! కేసులో సునీల్ నాయక్ చేసిన ట్వీట్ ఇప్పుడు ఈ మొత్తం వ్యవహారంలోని అసలు కుట్ర కోణాన్ని బయట పెడుతోంది. ఒక ఐపీఎస్ అధికారి స్థాయి వ్యక్తి, తనను ఒక మాజీ ఎంపీ బెదిరించారని, అది కూడా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరును ఈ కేసులోకిలాగాలని ఒత్తిడి చేశారని బహిరంగంగా ఆరోపించడం సామాన్యమైన విషయం కాదు. ఇది రఘు రామకృష్ణరాజు ఆడుతున్న రాజకీయ చదరంగంలో అధికారులను పావులుగా వాడుకుంటున్న తీరుకు నిదర్శనం. ఈ కేసులో రఘురామకృష్ణరాజు వాదనలోనిడొల్లతనాన్ని పాట్నా కోర్టు ఉదంతం స్పష్టం చేస్తోంది. ఒక పక్క తానుబాధితుడిననిచెప్పు కుంటూనే,మరోపక్క దర్యాప్తు సంస్థలను తన గుప్పిట్లోకి తీసుకుని అధికారులపై వేధింపులకు పాల్పడు తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీహార్ వెళ్లిన ఏపీ పోలీసులు అక్కడ కనీస చట్టపరమైన నిబంధనలను పాటించకపోవడం, తెలుగులో ఉన్న పత్రాలను చూపించడం వంటివి చూస్తుంటే, చట్టం కంటే రఘు రామకృష్ణరాజు రాజకీయ అజెండానే అక్కడ బలంగా పనిచేసిందని అర్థమవుతోంది. ఇంత గా వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అదేచిగా ఉప యోగిస్తున్నటువంటి ప్రజాప్రతినిధులు వ్యవస్థలకు ప్రజాస్వామ్యానికి ఆటంకము కాదా.....!.. అందుకే కోర్టు ట్రాన్సిట్ రిమాండ్‌ను తిరస్కరించడమే కాకుండా, 30 రోజుల పాటు రక్షణకల్పించింది. ఇదిరఘురామకృష్ణరాజు సాగించిన 'అతి'కి తగిలిన చట్టపరమైన చెంపపెట్టు. రఘురామకృష్ణరాజు ఈ కేసును కేవలం జగన్ గారిపై కక్ష సాధింపు కోసమే వాడుకుంటున్నారని అనిపిస్తోంది. సునీల్ నాయక్ వద్ద ఉన్నాయంటున్న కాల్ రికార్డింగ్స్ గనుక బయటపడితే, రఘురామ అధికారులను ఎలా బ్లాక్‌మెయిల్ చేశారో, జగన్ గారి పేరు చెప్పకపోతే కెరీర్ నాశనం చేస్తానని ఎలా బెదిరించారో లోకానికి తెలుస్తుంది. ఒక బాధితుడు ఎప్పుడూ న్యాయం కోసం పోరాడతాడు కానీ, ఇలా అధికారులపై ఒత్తిడి తెచ్చి తనకు



కావాల్సిన స్టేట్‌మెంట్లను సృష్టించాలని చూడడు. ఇక్కడే రఘురామ నైతికత ప్రశ్నార్థకమవుతోంది.

సికింద్రాబాద్ ఆర్మీ హాస్పిటల్ నివేదికలో కాలి వేలు విరిగిందని తేలడం నిజమే కావచ్చు, కానీ ఆ గాయం వెనుక ఉన్న వాస్తవాలు వేరుగా ఉండవచ్చు. తనపై రాజద్రోహం కేసు నమోదైనప్పుడు, ఆ అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి లేదా సానుభూతి పొందడానికి ఆయన స్వయంగా చేసుకున్న గాయం ఏమో అనే అనుమానాలు మొదటి నుంచీ ఉన్నాయి. ఇప్పుడు సునీల్ నాయక్ వంటి అధికారులు ధైర్యంగా ముందుకు వచ్చి రఘురామ బెదిరింపుల గురించి మాట్లాడుతుండటంతో, జగన్ గారిని బద్నాం చేయాలని చూసిన రఘురామ ప్లాన్ రివర్స్ అయి ఆయనమెడకే చుట్టు కుంటోంది. ముఖ్యంగా ఒక దళిత (గిరిజన తెగలకు చెందినసామాజిక వర్గానికి చెందిన అధికారిని టార్గెట్ చేయడం ద్వారా రఘురామ తన అహంకారాన్ని తన పెత్తందారి తనాన్ని ప్రదర్శించారని సునీల్ నాయక్ ఆరోపించడం గమనార్హం. గత ప్రభుత్వంలో నిబద్ధతతో పనిచేసిన అధికారులను ఇలా వేధించడం ద్వారా, భవిష్యత్తులో ఏ అధికారి కూడా ప్రభుత్వానికి అనుకూలంగా పని చేయకూడదనే భయాన్ని సృష్టించాలని ఆయన చూస్తున్నారు. కానీ చట్టం ముందు అందరూ సమానమే అని పాట్నా కోర్టు తీర్పు నిరూపించింది. ఈ కేసులో జగన్ గారి ప్రమేయం లేదని, ఇది కేవలం రఘు రామకృష్ణరాజు సృష్టించిన పొలిటికల్ డ్రామా అని తేలడానికి ఎంతో సమయం పట్టకపోవచ్చు. ఆశిద్దాం ప్రజాస్వామ్య ఉనికికి ప్రజల కోసం దశాబ్దాలు పని చేయవలసిన వ్యవస్థలలోని ఉన్నత అధికారులకు న్యాయం జరిగి వారికి వ్యవస్థల పట్ల నమ్మకం సన్న గిల్లకుండా ఉండేందుకు తగు న్యాయం జరుగుతుందని.

## వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందిస్తాం

### జనసేన, బీజేపీతో అందుకే కలిశాం: మార్కాపురంలో చంద్రబాబునాయుడు

మార్కాపురం: గత వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవేదన



వ్యక్తం చేశారు. పునర్నిర్మాణం కోసం గత ఎన్నికల్లో ప్రజల సహకారం కోరానని తెలిపారు. రాష్ట్రం కోసమే జనసేన, బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ఆశీస్సులు అందు కున్నామని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేటుతో అఖండ విజయం కట్టబెట్టారని ఆనందం వ్యక్తం చేశారు. అరకు నుంచి ఉమ్మడి ప్రకాశం వరకు ఒక్క సీటు కూడా వైసీపీకి రాలేదని అన్నారు. 'మార్కాపురం జిల్లా కళ, వెలిగొండతో జలకళ, హార్టికల్చర్ రైతుల జీవితాల్లో కళకళ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపుపై కలియతిరుగుతూ ప్రజల హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో ప్రకాశం, మార్కాపురం జిల్లా అంతా కూటమిని వంద శాతం గెలిపించాలని కోరారు. 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలుకు వెళ్లాల్సిన ఇబ్బందిని తొలగిస్తూ మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నామని అన్నారు. మార్కాపురం జిల్లా మదనపల్లి జిల్లా, అలాగే పోలవరం జిల్లాను కూడా ఏర్పాటు చేశామని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలు నీరు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారని, మార్కాపురానికి మరో వరంగా వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఈ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని, అదే ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఇప్పుడు తనకు అవకాశం వచ్చిందని అన్నారు. 2019-24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు అని వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టు ఒక్క అడుగు పడలేదని అన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే 4.35 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగిరి లాంటి నియోజకవర్గాలతో పాటు ఉదయగిరి, కడప, బద్వేలుకు కూడా నీళ్లు వెళ్తాయని అన్నారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇచ్చేవాళ్లమని వెల్లడించారు. గత పాలకుడు పనులు పూర్తి అయ్యాయని దొంగ నాటకాలు ఆడారని, పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని విమర్శించారు. నిజంగానే ప్రాజెక్టు పనులు పూర్తి అయి ఉంటే ఇప్పుడు నేను రావాల్సిన అవసరమే ఉండేది కాదని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి చేస్తానని నాలుగు సార్లు సభలు పెట్టి నాలుగు తేదీలు ఇచ్చాడని అన్నారు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కట్ చేసి మోసం చేశాడని మాజీ ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. రూ.9081 కోట్ల నిధులు ఈ ప్రాజెక్టుకు అవసరమని, ఇప్పటి వరకు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశామని, మరో రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావని అన్నారు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసి బహిరంగ సభకు వచ్చానని తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని పంగ నామాలు పెట్టారని మండిపడ్డారు. ఎవరు మంచి చేస్తే వారికి అండగా నిలిస్తేనే ప్రజల జీవితాలు మెరుగవుతాయని అన్నారు.

## దాడులకు బాధ్యులెవరు?

### జర్నలిస్టులు హద్దులు ఎర గాలి....!

### సంఘనాయకులు బాధ్యత గుర్తించాలి....!

### యాజమాన్యాల రాజకీయాలకు పాత్రికేయులేసమిధలు....!

**నవతరం, శ్రీకాకుళం**

ఎన్నికలకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్న వేళ, రాయలసీమలో రాప్తాడులో వైసీపీ నిర్వహించిన 'సిద్ధం' సభలో ఒక దిన పత్రిక ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడి జర్నలిస్టులకు ఓ హెచ్చరిక వంటిది. పత్రికా యాజమాన్యాల రాజకీయాలకు జర్నలిస్టులు బలవుతున్నారు. ఈ ఘటన మరోసారి జర్నలిస్టుల హద్దులను, జర్నలిస్టు సంఘాల నాయకులు బాధ్యతలు గుర్తించాల్సిన ఆవశ్యకతను తెలియజేసింది.

సమాజంలో జర్నలిస్టులూ ఒక భాగం. అది రాసే జర్నలిస్టులైనా, దిద్దే జర్నలిస్టులు (సబ్‌ఎడిటర్లు, ఎడిటర్లు), ఫొటో జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ మీడియా, యూట్యూబ్ జర్నలిస్టులు.. ఎవరైనా వారికి రాజకీయ భావాలు ఉంటాయి. వాళ్లు కూడా ఓటర్లు, పౌరులే కాబట్టి ఏదో ఒక పార్టీ మీద, నాయకుల మీద అభిమానం ఉండడం సహజం. ఎంత నిజాయితీగా రాసినా ఏదో మూల అభిమానం తొంగి చూస్తుంటుంది. వాళ్లను ప్రశంసిస్తూ ఓ మాట రాస్తే ఫర్వాలేదు. నచ్చనివారి వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ చేసే దూషణాలు అక్షరార్థం కాదు. కానీ గత దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాలలో వ్యక్తిగత హేళన కొన్ని బూర్జువా పార్టీలకు రక్షణ కోసం మీడియా చేస్తున్న పని సమాజానికి ద్రోహంవంటిది. కానీ, తమకు నచ్చకపోయినా ఆయా పత్రిక సంస్థల యాజమాన్యాల ఆదేశాలకు అనుగుణంగా రాత రాయాల్సిన పరిస్థితి ప్రస్తుతం నెలకొంది.

గతంలో రాజకీయ పార్టీలు కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు, విశ్లేషణ వేర్వేరుగా ఉండేవి. జర్నలిజంలో ఉత్తమ పాత్రికేయ విలువలు పాటించిన తెలుగు పత్రికల్లో ఆంధ్ర పత్రిక, ఆంధ్ర ప్రభ దినపత్రికలను పేర్కొనాలి. స్వాతంత్ర్యం వచ్చిన తొలి నాళ్లలో ఆంధ్ర పత్రికలో కాంగ్రెస్ పార్టీలో చేరాలన్న ప్రకటన ఉన్నా, ఇతర పార్టీల వార్తలకు ప్రాధాన్యం ఉండేది. ఆంధ్ర ప్రభ యజమాని వ్యాపారవేత్త అయినా, పత్రిక నిర్వహణలో రాజీ ధోరణి కనబర్చలేదు. నాటి వ్యాపారవేత్తలకు పత్రికలున్నట్టే, నేడూ వ్యాపారవేత్తలకు పత్రికలున్నాయి. నాడు ఇతర వ్యాపారాల్లో వచ్చిన ఆదాయంతో పత్రికలను నిర్వహిస్తే, నేడు వ్యాపారాల్లో అక్రమాలను అడ్డుకునేందుకు పత్రికలను ఉపయోగించుకుంటు న్నారు. ఆంధ్ర పత్రిక యజమాని అమృతాంజనం మీద వచ్చిన ఆదాయాన్ని వెచ్చించేవారని చెబుతారు.

గతంలో ఒక వామపక్ష పత్రికలో 1999లో ఎలక్షన్ డెస్క్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసాను. నాడు విశాఖపట్నం -1 నియోజకవర్గం నుంచి వామపక్షాల పొత్తుతో టీడీపీ అభ్యర్థి ఒకవైపు, బీజేపీ మరో వైపు బరిలో ఉన్నాయి. బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయమని విలేకరి రాసారు. విలేకరితో మాట్లాడిన తర్వాత, బీజేపీ అభ్యర్థి (కంభంపాటి హరిబాబు అనుకుంటా) విజయావకాశాలు ఉన్నాయని రాసాం. ఎన్నికల ఫలితాల్లో అదే వాస్తవమైంది. నాడు బ్యూరో, ఎడిషన్ ఇన్‌ఛార్జి ఇద్దరూ పార్టీ సంఘాల నుంచి వచ్చినవారే. మర్నాడు వార్త చూసిన తర్వాత వారేమీ తప్పుబట్టకపోగా మెచ్చుకున్నారు. తర్వాత కాలంలో, ఆ పేపర్ పార్టీ పత్రికగా కాకుండా జనరల్ పేపర్‌గా ప్రజల్లోకి వెళ్లాలని మాస్టర్‌హెడ్‌లో ఉన్న పార్టీ గుర్తు తీసేసారు. దురదృష్టమేమిటంటే, జనరల్ పత్రికగా గుర్తింపుకోసం ఓ వామపక్ష పత్రిక అంత తాపత్రయపడితే, ప్రస్తుతం జనరల్ పత్రికలుగా చెప్పుకుంటూ పార్టీల కరపత్రాలు మారిన న్యూస్ పేపర్లు న్యూసెన్స్ చేస్తున్నాయి.

గతంలోనూ జర్నలిస్టులను దుర్భాషలాడినవి, దాడికి పాల్పడిన



ఘటనలు చాలా తక్కువ ఉండేవి. అందులో వృత్తిపరమైనవి, వ్యక్తిగతమైనవి కూడా కలిసిపోయేవి. ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గతంతో పోలిస్తే జర్నలిస్టులపై దాడులు పెరుగున్నా, తమకు వ్యతిరేకంగా వార్తలు రాసారనే కారణంతో వ్యక్తిగత దాడులకు పాల్పడుతున్న ఘటనలు తక్కువవుతున్నాయి.

తెలుగు మీడియాను గమనిస్తే, తటస్థంగా ఉండి వార్తలు అందించే పత్రికలు ఉన్నా అవి చాలా తక్కువగా ఉన్నాయి. వాటి మైలేజీ తక్కువ. రాజకీయ పార్టీలకు అనుబంధంగా పలు సంఘాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా, ఆయా రాజకీయ పార్టీల వైఖరికి అనుగుణంగా ఆయా సంఘాలు స్పందిస్తాయి. గత కొన్ని దశాబ్దాలుగా మీడియా కూడా పార్టీల పట్ల సానుకూల వైఖరి ప్రదర్శించే స్థాయి నుంచి, తమ యాజమాన్యం మెచ్చని పార్టీని దూషిస్తూ, రాజకీయ పార్టీల అనుబంధ సంస్థగా మార్చేసాయి. ఇది గత పదేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో జర్నలిజంను పతనావస్థకు చేర్చింది. కొన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వార్తలు, డిబేట్లు చూస్తే, దీనిని జర్నలిజం అంటారా అనే అనుమానం కలుగుతుంది. ఒక వర్గపు మీడియాను బులుగు మీడియా అని, మరో వర్గపు మీడియాను ఎల్లో మీడియా అంటూ ఆయా పత్రికలు, యజమానుల పేర్లతో దూషించడం కనిపిస్తోంది. బులుగు, ఎల్లో మీడియా చర్చలకు వెళ్లే బీజేపీ ప్రతినిధుల్లో కొందరు రెండు చోట్లా అవమానాలకు గురవుతున్నారు.

గతంలోలా కాకుండా, మీడియా కూడా వ్యాపారంగా మారింది. ఆయా యజమానులకు ఉన్న వ్యాపారాల్లో ఇదొకటి. ఇతర వ్యాపారాల్లో అక్రమాలు జరిగితే ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి సిద్ధపడితే రాజకీయ కక్షగా రాజకీయ పార్టీలు ఆరోపించడం మామూలే. బాధ్యత గల జర్నలిస్టు సంఘాల నాయకులు కూడా ఆ రాజకీయ పార్టీల నాయకుల్లాగే మాట్లాడడమే శోచనీయం. నైతిక విలువలు వదిలేసిన పత్రికల యాజమాన్యాలకు జర్నలిజం విలువలు చెప్పాల్సిన జర్నలిస్టు సంఘాలు నోరెత్తడం లేదు. జర్నలిస్టు నాయకులుగా గుర్తింపు ఉన్న వారు కూడా అటు బులుగు, ఇటు ఎల్లో మీడియాలో ఆయా యాజమాన్యాల వాణి వినిపిస్తున్నారు. జర్నలిజానికి రాజకీయ నాయకుల కన్నా పత్రికాధిపతుల తీరు, జర్నలిస్టు సంఘాల నాయకుల వైఖరితో నష్టం జరుగుతోంది. గతంలో కేసీఆర్, చంద్రబాబు ముఖ్యమంత్రులుగా ఉండగా కొన్ని మీడియా సంస్థల ప్రసారాలను నిషేధించారు. రాజకీయ పార్టీలు కొన్ని మీడియా సంస్థలను బహిష్కరించాయి. అయినా సరే, ఆ పార్టీల కార్యక్రమాలకు తమ ప్రతినిధులను పంపి రాజకీయ మీడియా యాజమాన్యాలు రెచ్చగొడుతున్నాయి. ఇలా దాడులు జరిగిన తర్వాత ఖండిరచడం కన్నా జర్నలిస్టు సంఘాలు బాధ్యత గుర్తించి, జర్నలిజం విలువల గురించి ఆయా యాజమాన్యాలకు చెప్పాలి. వచ్చావా టీ తాగి వెళ్లిపో అని ఓ నాయకుడు అన్నప్పుడో, ఫలానా పేపరు విలేకరి ఎవరు అని లేపి మరో నాయకుడు అవమానించినపుడో జర్నలిస్టు నాయకుల్లో స్పందన కలిగి ఉండాలి. నాడు మౌనంగా ఉండి దాడులు జరిగినపుడు ఖండిస్తే ఉపయోగమేమిటి? అసలు జర్నలిస్ట్ సంఘాలు కార్పొరేట్ పత్రికల సమస్యల మీద వారికి ఏదైనా దాడి జరిగితే మాత్రమే స్పందిస్తున్నారు తప్ప తటస్థవాదుల చిన్న మధ్య తరగతి పత్రికలుగా చెప్పుకుంటున్న పాత్రికేయులు లకు జరుగుతున్న దాడులు పైన గాని లేక వారికి జరుగుతున్న నష్టానికి ప్రభుత్వాల వైఖరికి ఏనాడు వ్యతిరేకించి మాట్లాడిన పరిస్థితి జర్నలిస్ట్ సంఘాలలో కూడా లేదన్నది నిజం. కనీసం జర్నలిస్టులైనా ఆ ఖండనను స్వీకరిస్తారా? వాస్తవాలను ప్రచురించి, ప్రసారం చేసేలా యాజమాన్యాలపై జర్నలిస్టు సంఘాలు, ప్రెస్‌క్లబ్‌లు ఒత్తిడి తేవాలి. జర్నలిస్టు సంఘాల నాయకులు తమ బాధ్యతను గుర్తించనంతవరకూ, యాజమాన్యాల తీరుతో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉంటాయి. జర్నలిస్టులు బాధితులుగానే ఉంటారు.!

**(వ్యాసం హేమ చందర్ కొలిపాక)**

# గత రాత్రి జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న పెద్దలు!

**వాసుపల్లిగణేష్ కుమార్ మాజీ ఎమ్మెల్యే కుమారుని వివాహ వేడుక!**

**ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో అంగరంగ వైభవముగా జరిగిన వివాహము**



**నవతరం, విశాఖపట్నం**

ఈ రోజు ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో మాజీ ఎమ్మెల్యే శ్రీ వాసుపల్లి గణేష్ కుమార్ కుమారుడు గోవింద్ సాకేత్ పెళ్లి రిసెప్షన్ వేడుకల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ కురశాల కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌తో కలిసి పాల్గొని వధూవరులును ఆశీర్వదించిన విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు భారీ





# తిరుపతి ఆవిర్భవించి 896వత్సరాలు (నిన్నటికి) పూర్తయిన సందర్భంగా..

కట్టెదుర వైకుంఠము
కాణాచైన కొండ..
తెట్టలాయ మహిమలే
తిరుమల కొండ..
తిరుమల కొండ..!

వేదములే శిలలై
వెలసినది కొండ
ఏడేస పుణ్యరాసులే
ఏరులైనది కొండ..
గాదిలి బ్రహ్మదిలోకముల
కొనల కొండ..
శ్రీదేవుడుండేటి శేషాద్రి కొండ!

అదేమిటో..తిరుపతి యాత్ర
అనగానే అద్భుతమైన
ఆధ్యాత్మిక పులకింత..
భారతావనిలో
ఎన్ని క్షేత్రాలున్నా
తిరుమల
పవిత్రభావనల అల
నిజమయ్యే జన్మజన్మల కల..
ఒక రకమైన చింతనలో
పడేసే వల..

తిరుమల సందర్శనం..
స్వామి దర్శనం..
కలియుగంలో
ఆధ్యాత్మికతకు నిదర్శనం..!

ఒక్కో కొండ దాటుతుంటే
మెట్టు మెట్టు ఎక్కుతుంటే
అందమైన ఆ ప్రకృతి
తీసిపారేయదా
మనలోని వికృతి..
ఇహంపై మోహం నశించి..
తనువెల్లా పరవశించి..
నీలోని జీవుడికి దూరంగా..
దేవుడికి దగ్గరగా..
అదే మోక్షమై..
పాపం క్షయమై..!

ఏడుకొండలపై కోనేటి స్నానం
వెంకన్న దర్శనం..
విమాన వేంకటేశ్వరుని
సందర్శనం..
అంతకు మునుపు
కింద గోవిందరాజు
కుంచంతో కనువిందు..

ఆపై పాపనాశం..
ఆకాశగంగ..
మధ్దిమధ్దిలో
చిన్న చిన్న గుడులు..
మదిమదిలో భక్తిభావన..
దర్శనం క్యూలైన్లో
వుండగానే బావాజీతో
స్వామి పాచికలాడే
కమనీయ దృశ్యం..
పాచికలంటే
పరాచికాలు కాదండోయ్..
ఇలలో..కలియుగంలో
జరిగిన అద్భుతం..
ఇలా ఎన్నెన్నో విశేషాలతో
శేషాచల సమూహంలో
సాక్షాత్తు పరమాత్మ
సన్నిధిలో యాత్ర..!

కొండ దిగుతూ
ఆంజనేయునితో ముచ్చట..
మంగాపురంలో అమ్మతో
నను బ్రోవుమని చెప్పవే
అంటూ ఓ చిన్న మాట..
అటు పిమ్మట..

కాళహస్తిలో శివయ్య..
కాణిపాకంలో ఆయన కొడుకు
గణపయ్య..
ఈ మొత్తం యాత్రలో
గోవిందా...గోవిందా
ఇదే నామజపం..
ఓ పరితాపం..పశ్చాత్తాపం..
ప్రయాణం కాదది ప్రమోదం..
భగవంతునికి ఆమోదం!

కొండపై కొండంత అండ..
యాత్రికుల కడుపునిండ
వెలసింది అన్నసత్రం..
వెంగమాంబ చేతి పాత్రం..
ఆ మహాభక్తురాలి
వీలునామా పత్రం..
ఆమె వెంకన్న గూటిలో గువ్వ
తన పేరిట భక్తులకు
కడుపు నిండా బువ్వ..!

వివాహ భోజనంబు..
వింతైన వంటకంబు..
వెంకన్న చేతి విందు..
అహహ్హ..ఎందరొచ్చినా
తరగని అదే పసందు
అదేమి శేషాచలమో..!

అక్కడ అదెంత మహిమో..
అది అన్నసత్రమో..
ఆదిదేవుడిచ్చిన అక్షయపాత్రమో..



ఆరగించే ప్రతి భక్తుడూ
శ్రీనివాసుని అనుగ్రహపాత్రమే!
ఇక...తిరుపతి లడ్డు..
ఇలలోన ఇంతకు మించిన
రుచి ఉన్నదా..
అదీ ఆధ్యాత్మిక సంపదా..
ఆహా.. ఏమి రుచి..
అనరా మైమరచి..!
భువిపై వేంచేసి ఉన్న
శ్రీనివాసుని చేతి చలువే సదా
ఆ అద్భుతానికి కలియుగంలో
భక్తులు
బహుదా..ఫిదా..సదా..
ఓ భక్తవరదా..!


**సురేష్ కుమార్ ఎలిశెట్టి**
9948546286
7995666286
**నవతరం, విజయనగరం**

# అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పోలయ్య కవి కూకట్లపల్లికి ఘనసన్మానం


**హైదరాబాద్, నవతరం**

విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుక రవీంద్రభారతిలో జరిగింది. సమితి అధ్యక్షులు డాక్టర్ జల్దీ విద్యాధర్ సారథ్యంలో కళారత్న





డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోగంటి ఉషారాణి డా.ఝాన్సీ ముడుంబై సమన్వయ కర్తలుగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో హైదరాబాద్ అత్తాపూర్ నివాసి ప్రముఖ కవి రచయిత నటుడు పోలయ్య కవి కూకట్లపల్లి పాల్గొని" జై తెలుగుతల్లి జయహో తెలుగు తల్లి" కవితను గానం చేసి ప్రముఖులచే ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య కొలకలూరి ఇనాక్ కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ డాక్టర్ జల్దీ విద్యాధర్ పోలయ్య కవిని ఘనంగా సత్కారించారు. ఈ సభకు ఆచార్య పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాతృభాషా పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతంటూ తెలిపారు. డాక్టర్ విజయలక్ష్మి పండిట్, కోయి కోటేశ్వరరావు, శైలజా మిత్ర, సరికొండ నరసింహ రాజు, నాళేశ్వరం శంకరం, వైరాగ్యం ప్రభాకర్, డా.రాధా కుసుమ, డాక్టర్ మునగా రామ మోహన్‌రావు తదితర సాహితీ మూర్తులు హాజరై మాతృభాషపై ప్రసంగించారు. తదనంతరం అతిథులకు కవితా గానం చేసిన కవులకు కవయిత్రులకు ఆత్మీయ సత్కారం జరిగింది.



# నేటి కంప్యూటర్ జంటలు..!

వర్క్ ఫ్రం హోం జీవితం
గాజు స్క్రీన్ ఇల్లు...
వెలుగు ఎక్కువ, వేడి మరింతగా...

నవ్వులు ఎమోజీలు
హృదయం మ్యూట్ మోడ్‌లో

జీతాలు డౌన్‌లోడ్‌లా
ఖాతాలు క్లౌడ్‌లా తాత్కాలికం...


ఫ్యాషన్ ఫిల్టర్‌లా
నిజాలు హిడెన్ ఫోల్డర్‌లో
అహంకారం హైపర్‌లింక్‌లా
మనసులు డిస్‌కనెక్ట్ నెట్‌వర్క్‌లా...

చిరు సమస్యలు బగ్‌లా
సర్దుబాటు అప్‌డేట్ కాని
సాఫ్ట్‌వేర్‌లా
విడాకుల విషాదం ఫార్మాట్‌లా

గతస్మృతులు డిలీట్ కాని
డేటాలా...

ప్రేమే...పాస్‌వర్డ్
నమ్మకమే...నెట్‌వర్క్
అవిలేని జీవితం
సిమ్ కార్డు సిగ్నల్ లేని
ఫోన్ లా నిశ్శబ్దమే
నిరుపయోగమే..

హృదయాలను రీచార్జ్ చేయండి
సత్సంబంధాలను సేవ్



చేసుకోండి...

అపార్థాలను లాగ్‌అవుట్ చేసి...
అహంకారాన్ని షట్‌డౌన్ చేస్తే...
సహనాన్ని రీబూట్ చేసి...
అమరప్రేమను అప్‌డేట్ చేస్తే...

మీ ఇల్లు నందనవనమే...
మీ జీవితం నవవసంతమే..!

రచన :
కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
**పోలయ్య కూకట్లపల్లి**
అత్తాపూర్, హైదరాబాద్

# 'డయేరియా' మరణాలపై ధర్మాన ప్రసాదరావు ఫైర్

శ్రీకాకుళం జిల్లాలో ప్రబలిన డయేరియా బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత 20 నెలల కూటమి పాలనలో ప్రజారోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు ప్రజలకు శాపంలా మారాయని మండిపడ్డారు. అతిసార వ్యాధితో జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోతే, ప్రభుత్వం మాత్రం కేవలం ఒకరు లేదా ఇద్దరే చనిపోయారని అబద్ధపు లెక్కలు చెబుతోందని ధర్మాన ఆరోపించారు. "వాంతులు, విరోచనాలతో ప్రజలు అల్లాడుతుంటే, సహాయం చేయాల్సింది పోయి పోస్టుమార్టం నివేదికలంటూ కాలయాపన చేస్తున్నారు. గత డిసెంబర్‌లోనూ బలగ ప్రాంతంలో ఇలాగే డయేరియా విజృంభించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదు. ప్రస్తుతం 100 మందికి పైగా రోగులు ఆసుపత్రుల పాలయ్యారు. మంచి ప్రభుత్వం అని స్టిక్కర్లు వేసుకోవడంపై ఉన్న శ్రద్ధ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో లేదు" అని ధ్వజమెత్తారు. ప్రతి జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు అందించాలనే గత ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రైవేటీకరణ పేరుతో తుంగలో తొక్కారని ధర్మాన విమర్శించారు. రాజధాని పేరుతో డబ్బునంతా ఒకే చోట కుమ్మరిస్తూ, జిల్లాల అభివృద్ధిని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. సాగుకు యూరియా అందక రైతులు, ఇంగ్లీషు మీడియం చదువులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యానికి మద్దతు ధర లేకపోగా, క్వింటాల్‌కు రెండు కిలోల చొప్పున అదనంగా దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. శ్రీకాకుళం అభివృద్ధి కోసం కనీసం వెయ్యి కోట్లు అయినా ఖర్చు చేశారా? అని ప్రశ్నించిన ఆయన... ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని హెచ్చరించారు. ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

# అహింసా విప్లవంతో సత్యాగ్రహ పోరాటమే గాంధీ సిద్ధాంతం

అహింస అనే విప్లవ పంథాతో సత్యాగ్రహ పోరాటబాట పడితే విజయం తథ్యమని సిద్ధాంతీకరించారు గాంధీ మహాత్ముడు. ఎంతటి శత్రువు ఎదురైనా, శారీరక హింస, మరణం తప్పదనితెలిసినా ఓర్పు,సహనం, చిరునవ్వుతోచేసే, క్షమతోకూడిన పోరాటమే సత్యాగ్రహం. ఆయన సమాజం మొత్తంగా మార్చాలన్న సిసలైన విప్లవవాది.ఆ మార్పు అహింసా యుతంగా ఉండాలని ప్రతిపాదించిన సిద్ధాంతకర్త గాంధీ.అహింస జీవన విధానంగా మార్చుకుంటే భవిష్యత్ మహిళ చేతుల్లోనే నన్న గాంధీ. నైతికబలంలో స్త్రీ లకే అధికమని, ఈ అహింసా సమరంలో మహిళలే నాయకత్వానికి అర్హులన్నారు.

గాంధీ గురించి విశ్లేషిస్తే అమ్మలా లాలింపు అడుగడుగునా కనిపిస్తుంది.గాంధీ వ్యక్తిత్వం పరికిస్తే వేరువేరుకోణాల్లో బుద్ధుడు,ఏసుక్రీస్తు,వివేకానందుడు కనిపిస్తారు.భోధనల్లో కొంత సారూప్యత కనిపిస్తుంది. దిగ్గజ సంపాదకుడు "నార్ల" మాటల్లో అహింస ను వ్యక్తుల ద్వారా బుద్ధుడు, ఏసుక్రీస్తు సిద్ధాంతంగా ప్రయోగిస్తే,సంఘం ద్వారా గాంధీ ప్రయోగించడమే గొప్ప దార్శనికత.ఒక్క మాటలో చెప్పాలంటే గాంధీ సార్వత్రికంగా, సహజంగా, సర్వతోముఖంగా కనిపిస్తారు. గత ఐదువేల సంవత్సరాలలో ఇలాంటి మహోన్నతవ్యక్తిలేరు అంటే అతిశయోక్తికాదు.

"అసలైనవిప్లవవాది,సిసలైన సిద్ధాంతం కర్త గాంధీజీ" పుస్తకం వ్రాసింది ఆకాశవాణి పూర్వ డైరెక్టర్, సాహిత్యం, సైన్స్, సామాజిక విశ్లేషకులు నాగసూరి వేణుగోపాల్. గాంధీ ఆలోచనలు, వ్యక్తిత్వం, ఉద్యమ సారధిగా అవతరించడం, విలక్షణ నేతలను, దేశప్రజలను స్వాతంత్ర్య పోరాటం వైపు నడిపించిన విజయ సారథి గాంధీజీని అనేక కోణాల్లోపరిశోధించి పాఠకులకు పరిచయం చేసిన రచయిత కృషి అభినందనీయం. గాంధీ మానసికంగా, శారీరకంగా బలశాలి. రోజుకు 18 నుంచి 22 కిలో మీటర్లు నడిచేవారు. ఒకోసారి 40 కీ.మీకూడా నడిచేవారు. చిన్న చిన్న ఆరోగ్యం సమస్యలు మినహా చివరివరకూ ప్రజల్లో ఉన్నారు. దేశం మొత్తం స్వాతంత్ర్య సంబరాల్లో ఉండగా గాంధీ మాత్రం నౌఖాలీ లో గాయపడిన వారిని పరామర్శించడానికి వెళ్లడం ఆయన ప్రత్యేకత. చివరివరకూ రోజుకు 18 గంటలు పని చేయడం ఆయన ధృడత్వాని దర్పణం.

గాంధీ ఒకదశలో మెడికల్ డిగ్రీ సాధించి వైద్యుడిగా స్థిరపడాలని భావించారు.ఆయన కుటుంబం బారిస్టర్ చదవాలని ఒప్పించారు. దక్షిణాఫ్రికాలో మరోప్రయత్నాన్ని అక్కడ ఆయన చేపట్టిన వివక్ష నిర్మూలనా ఉద్యమం ఆటంకమయింది. ఆయుర్వేదంలో పరిశోధనలు పెరగాలని, వైద్యులు మెరుగుపడాల్సి ఉందని నిర్మొహమాటంగా చెప్పారు.

గాంధీ ఒక విషయంపై ఆసక్తి చూపితే దాన్ని లోతుగా అధ్యయనం చేసేవారు. ఏదైనా విషయం మీద ఎక్కువ అభిప్రాయాలుంటే తాజా అభిప్రాయమే సవరించిన అభిప్రాయంగా పరిగణించమంటారు గాంధీజీ.నగరాలు నిరంతర అహంకారంగా ఉంటాయని ఆయన వ్యాఖ్యల వెనుక వర్తమానకాలపు వనరులు దోపిడీ వంటి దుర్గుణాలు లను ప్రస్తావించడం గమనార్హం. భార్య కస్తూర్బా అన్నింటా తోడు నీడగా ఉండడం కూడా ఆయన విజయ రహస్యం.

1900లో కస్తూర్బా సుఖప్రసవానికి వైద్య పుస్తకాలు చదివి మంత్రసానిగా మారారు. దేవదాస్ గాంధీ పుట్టుక సమయంలో ఆయన స్త్రీ హృదయం వెల్లడయింది.ఆంగ్ల భాషలోనే మనకు బానిస ధోరణి అలవడిందని అంటారు.మాతృభాష లోనే సైన్స్ భోధన జరగాలన్నారు.ఇంగ్లండ్లో చదివి, దక్షిణాఫ్రికా లో ఉన్నప్పుడూ తన ఆత్మకథ గుజరాతీ లోనే రాసారు.మానవుడి శరీరమే అతి సంకీర్ణమైన యంత్రమని తెలిసి యంత్రాలకు వ్యతిరేకిని ఎలా అవుతానని ఆయన అనడం గమనార్హం.కాని యంత్రాలవ్యామోహానికి వ్యతిరేకినన్నారు. వ్యవస్థలు, దేశం గూర్చి మాట్లాడుతూ లక్ష్యం కేంద్రీకృతమై ఉండాలి. అమలు వికేంద్రీకరించాలన్నారు.గ్రామ స్వరాజ్య భావన అందులోంచి వచ్చింది. రాజకీ యాలు, నాయకులు గురించి మాట్లాడుతూ కమ్యూనిస్టులందరూ చెడ్డవారు కారు,కాంగ్రెస్ వారందరూ దేవతలు కాదన్నారు. కమ్యూనిస్ట్ సిద్ధాంతాలను మాత్రం ఆమోదించలేనన్నారు. ఈ భావాలు సమ్మేళనం పరిశీలిస్తే గాంధీ అత్యంత ఆధునికుడిగా అవగతమవుతాడు.

కళ్లజోడు, చేతికర్ర, చెప్పులజత, మొలగడియారం, కొల్లాయి, పుస్తకం కాదు గాంధీ అంటే.అది ఆయన ఆహార్యం. గాంధీ అంటే సహజంగా జీవించడం, సమన్వయంతో సాగిపోవడం, తలవంచకుండా నిలబడడం, సాటి మనిషి సమస్య తన సమస్యగా స్వీకరించడం, వివాదం వస్తే ఎదుటివారి వాదన సహనంతో వినడం, సత్యాగ్రహం అనే విజయ ఆయుధం ఇవ్వడం వంటివి. తన జీవితాన్నే కాదు, మొత్తం సమాజాన్నే ప్రయోగశాలగా చేసి జీవించిన మహామనిషి.అందుకే మహాత్ముడు అయ్యాడు. మహా కవి శ్రీశ్రీ మాటల్లో "గాంధీ ఒక సామాన్య వ్యక్తి, అసామాన్య వ్యక్తి,తృణం కన్నా తేలిక, మేరువు కన్నా ధీరుడు" అనడం విశేషం. విజయానికి ఆయుధాల కన్నా అహింసాపోరాటానికి 11 రేట్లు అవకాశాలు ఎక్కువ అన్నారు గాంధీజీ. సెవెన్ సిన్స్ ప్రమాదకరమైనవి, అవాంఛనీయమైనవని ఏడు సూత్రాలను ప్రతిపాదించారు.వాటిని మన జీవితంలో పరిహరిస్తే సంఘంతో పాటు ప్రపంచ నడత మారుతుందని సూత్రీకరించారు బాపూజీ.

1915లో గాంధీ దక్షిణాఫ్రికా నుంచి భారత్ వచ్చేటప్పటికి అనిబిసెంట్ హోం రూల్ ఉద్యమం నడుస్తున్నది. అహమ్మదాబాద్‌లో సత్యాగ్రహ ఆశ్రమం ప్రారంభించారు. గోపాలకృష్ణగోఖలే సలహా మేరకు సంవత్సరంపాటు దేశంలో విస్తృతంగా పర్యటించారు. ప్రజావాణి, స్థితిగతులు, బ్రిటీష్ వారి దురంతాలు తెలుసుకున్నారు. 1916లో గాంధీ తొలి ప్రసంగం బెనారెస్ విశ్వవిద్యాలయంలో చేసారు. కాంగ్రెస్ సమావేశాల్లో నెహ్రూతో పరిచయం అయింది. అతివాద, మితవాద నాయకులను సమన్వయపరిచి కాంగ్రెస్‌ను ముందుకు నడిపించారు. 1917లో చంపారణ్యంలో నీలిమందు రైతుల ఉద్యమంలో పాల్గొని తన విధానాన్ని దేశీయంగా పరిక్షించుకున్నారు. అహ్మదాబాద్‌లో జౌలీకార్మికుల సమస్యా పరిష్కారానికి కృషిచేసారు. గుజరాత్ ఖేడా కరువురైతుల సమస్య సత్యాగ్రహంతో పరిష్కరించారు. కరువు, ఇన్ ఫ్లుయంజా మహమ్మారితో కోటి20 లక్షలమంది ప్రజలు అసువులుబాసారు.దేశ జనాభా 1911 కంటే 1921 సెన్సెస్‌లో భారీగా తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి. 1919లో రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా "శాసనోల్లంఘన"కు పిలుపునిచ్చారు. ఆ ఏడాదే "జలియన్ వాలాబాగ్" దురంతం జరిగింది. 1921 మధురైలో కొల్లాయి కట్టి నేత కార్మికుల సమావేశంలో ప్రసంగించారు.1922 లో "చౌరీచోరా"లో ఉద్యమం అపసృతితో 22 మంది పోలీసులు మృతి చెందడంతో కలతచెందిన గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అర్థాంతరంగా ఆపివేశారు. సత్యాగ్రహ ఉద్యమానికి మరింత శిక్షణ అవసరమని భావించారు.1928లో సైమన్ కమిషన్లో భారతీయులు లేకపోవడంతో "గోబ్యాక్" అని అలజడి పెద్ద ఎత్తున చెలరేగింది. 1930లో ఉప్పు సత్యాగ్రహం,దండియాత్ర ప్రారంభించారు. ఆ తరువాత క్విట్ ఇండియా ఉద్యమం వరకూ గాంధీ కనపడరు.ఈ కాలంలో గాంధీ ఆలోచనల కేంద్రంగా సమాంతరంగా అనేకమంది ప్రముఖులు ఉద్యమానికి కృషి చేసారు. వికేంద్రీకరణకు గాంధీ ఉత్తరాల ద్వారా శ్రీకారం చుట్టారు. 1942లో జైలులో ఉన్నప్పుడే భార్య కస్తుర్బా, సహచరుడు మహదేవ్ దేశాయ్ లను కోల్పోయారు.హిందూ ముస్లింఐక్యత తొలినుంచి ప్రాధాన్యత ఇచ్చారు.చివరకు అదే ఆయన హత్యకు కారణమయ్యింది.దేశవిభజన అనంతరం చెలరేగిన నరమేధం గాంధీ హత్యతో తగ్గిందనేది వాస్తవం. గాంధీ రాజకీయ స్వాతంత్ర్యం తో పాటు గ్రామాలు, మహిళలు, విద్య, వైద్యం, పరిశ్రమలు, పర్యావరణం మెరుగవ్వాలని సిద్ధాంతీకరించిన గాంధీజీ. నెహ్రూ, పటేల్, జిన్నా, నేతాజీ, రాజాజీ, ప్రకాశం వంటి విలక్షణమైన నేతలను ఏకతాటి మీద నడిపించిన ఘనత గాంధీజీది.40 కోట్ల జనాభా గల ఈదేశాన్ని అహింస బాటలో నడిపించారు. ఈ పోరాటంలో 4 కోట్లమంది స్త్రీ, పురుషులు, యువత, పిల్లలు పాల్గొనడం గాంధీశాంతి మంత్రంతోనే సాధ్యమైంది.

కుటుంబపరంగా ఆయన అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. పెద్దకుమారుడు హరిలాల్ గాంధీని మొదటినుంచి వ్యతిరేకించారు. 1900లో నాల్గొ కుమారుడు దేవదాసు పుట్టాడు.

**సమీక్షకులు: యం.వి.రామారావు**

Printed by SIRIGIRI VARADARAJU, and published by SIRIGIRI VARADARAJU, on behalf of SIRIGIRI VARADARAJU, and printed at : Krathi Publications, D.No.18-11-12/1, Krishna Nagar, ward-39, RAJAHMUNDRY, EAST GODAWARI DIST. ANDHRA PRADESH STATE - 533 101, Published at : Kranthi Publications, D.No. : 18-11-12/1, Krishna Nagar Ward-39, RAJAHMUNDRY, EAST GODAWARI DIST, ANDHRA PRADESH STATE - 533101, Editor : SIRIGIRI VARADARAJU, Email: navataramraju@gmail.com, Cell : 9959007255